సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 1 । జూన్ । 2024



అప్పన్నకు ఘనంగా ఆర్జితసేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు 10లో

సిరులతల్లికి క్షీరాభిషేకం

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



10లో



అంధుల జీవితాల్లో ఆశాకిరణం

అంధ బాలికల చదువులకు విశాఖలోని పాఠశాల భరోసాగా నిలుస్తోంది. ఇక్కడ బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. 10లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- ఐటీడీఏ పీవో అభిషేక్



అధికారులు, వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు అరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతిరౌండ్‌లో మూడు ఈవీఎంలను ర్యాండమ్‌గా పరిశీలిస్తారని తెలిపారు. ప్రతి రౌండ్‌కు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలోని తహసీల్దార్ సుధాకర్, సోమేశ్వరరావు, వివిధ పార్టీల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గమ్మత్తయిన గుమ్మడి



దోసకాయ రూపంలో గుమ్మడికాయలు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ మాలిపుట్టులో రైతు సోమన్న తోటలో ఈ ఏడాది ఎప్పుడూ లేని విధంగా గుమ్మడికాయలు పొడవుగా దోసకాయ రూపంలో కాసాయి. గమ్మత్తుగా ఉన్న గుమ్మడి కాయలను కొనుగోలుదారులు విచిత్రంగా చూస్తున్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ అప్పారావు

పెదబయలు: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ గిడ్డి అప్పారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధిగా మెనూ అమలు చేయాలన్నారు. నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. రుచికరంగా ఆహారపదార్థాలు ఎలా తయారు చేయాలో వీడియో ద్వారా అవగాహన కల్పించారు.అనంతరం నిర్వాహకులకు వంటల తయారీపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మండలంలోని 152 పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. జిల్లా ప్రోగ్రాం సమన్వయకర్త వి.వెంకటరమణ, స్థానిక ఎంఈవో కొమ్ము కృష్ణమూర్తి, బాలరాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, ఉమామహేశ్వరరావు, సీఆర్పీలు మత్స్యరాజు, ఉపేంద్ర,ఐఈఆర్‌టీలు రవి భవానీ,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం(విశాఖ): భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- బెంగళూరు–హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటంపావు ఆలస్యంగా ఉదయం 11.45గంటలకు బయల్దేరింది.
- గౌహతి–త్రివేండ్రం(12508) ఎక్స్‌ప్రెస్ సుమారు 3గంటలు ఆలస్యంగా ఉదయం 9గంటలకు బయల్దేరింది.

ముచ్చెమటలు.. ముప్పుతిప్పలు!



విశాఖ బీచ్‌లో సేదతీరుతున్న ప్రజలు

- ఉక్కపోతకు ఎండవాత కూడా తోడు
- మరో మూడు రోజులు తప్పని అవస్థలు
- గాలిలో అధిక తేమ శాతమే కారణం
- అవిశ్రాంతంగా తిరుగుతున్న ఫ్యాన్లు, ఏసీలు

సాక్షి, విశాఖపట్నం : నైరుతి రుతుపవనాలు ఆగమనం, రోహిణి కార్తె నిష్క్రమించే వేళ ఉక్కపోత, ఎండవాత ఏకమై జనాన్ని అవస్థల పాల్జేస్తున్నాయి. రేయింబవళ్లు ముచ్చెమటలు పోయిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఒకపక్క వడగాడ్పులు వీస్తుండగా, మరోపక్క ఉక్కపోత ఊపిరి సలపనీయడం లేదు. ఉదయం నుంచి అర్ధరాత్రి దాటినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు ఉండడం లేదు. అన్ని వయసుల వారూ చెమటతో తడిసి ముద్దవుతూ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ప్రతి ఇంట్లోనూ 24 గంటలూ ఫ్యాన్లు, ఏసీలు అవిశ్రాంతంగా తిరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఉక్కపోత, చెమటల నుంచి ఉపశమనం లభించడం లేదు. ఇంట్లో ఉన్నా, పనులపై బయటకు వచ్చినా జనం ఉక్కిరిబిక్కిరి అవుతూనే ఉన్నారు.

అల్లూరి జిల్లాలో ఉష్ణోగ్రతలు	
కూనవరం	44.0
నెల్లిపాక	42.5
గంగవరం-2	42.2
చింతూరు	42.1
దేవీపట్నం	41.3
రంపచోడవరం	41.3
కొయ్యూరు	41.2

గడిచిన కొన్నేళ్లలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని వాతావరణ నిపుణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితికి గాలిలో తేమ అధికంగా ఉండటమే కారణమని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో గాలిలో తేమ 70–80 శాతం వరకు నమోదవుతోంది. శుక్రవారం ఇది మరింత అధికమైంది. గాలిలో తేమ వాల్తేరులో 80 శాతం, విశాఖ ఎయిర్‌పోర్టులో 81 శాతం రికార్డయింది. ఫలితంగా ఇటీవల రోజులకంటే శుక్రవారం ఉక్కపోత తీవ్రత మరింత అధికంగా కనిపించింది. రానున్న రెండు, మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది.

కొనసాగుతున్న ఉష్ణతాపం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉష్ణతాపం కొనసాగుతూనే ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40–44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. శుక్రవారం అల్లూరి జిల్లా కూనవరంలో అత్యధికంగా 44 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా రావికమతంలో 42.1, విశాఖపట్నం జిల్లా ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 41.8 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రానున్న మూడు రోజులు ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగనుంది.

ఈదురు గాలులు భారీ వర్షం

జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. రోజంతా సూర్యుడు నిప్పులు చెరిగాడు. మాడు పగిలే ఎండతో ప్రజలను బెంబేలెత్తించాడు. ఉక్కబోతతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం పలు మండలాల్లో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి ఓ మోస్తరు వర్షం పడింది.



చింతపల్లి ఐటీడీఏ క్వార్టర్స్‌వద్ద విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మ



కొయ్యూరులో కురుస్తున్న వర్షం



తోటకూరపాడులో మృతి చెందిన మేకలు, పశువులు

చింతపల్లిరూరల్/కొయ్యూరు/రాజవొమ్మంగి/హుకుంపేట: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఈదురుగాలులు, పిడుగులతో కూడి వర్షం పడింది. చింతపల్లి, కొయ్యూరు, రాజవొమ్మంగి, హుకుంపేట మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొయ్యూరు, హుకుంపేట మండలాల్లో పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొయ్యూరులోని ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చెట్టును తొలగించే పనులను స్థానికులు చేపట్టారు. చింతపల్లిలో ఐటీడీఏ క్వార్టర్స్ వద్ద విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మ పడింది.రాజవొమ్మంగిలో సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై, ఈదురుగాలులతో చిరుజల్లులు కురిసాయి.

పిడుగులు పడి వ్యక్తి, 24 మూగజీవాలు మృతి

భారీ వర్షానికి పిడుగుపడి కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ గొర్రెలమెట్టకు చెందిన సీదేరి దేవరాజ్(29) అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. దేవరాజ్ అడవి నుంచి ఇంటికి వస్తుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో ఓ పనసచెట్టు కింద తలదాచుకున్నాడు. ఆ సమయంలో చెట్టుపై పిడుగుపడడంతోమృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.భార్య ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నారు.



దేవరాజ్ మృతదేహం

- హుకుంపేట మండలంలో దుర్గం పంచాయతీ తోటకూరపాడు గ్రామం సమీపంలో కొండ ప్రాంతలో పిడుగు పడడంతో అక్కడ మేత మేస్తున్న నాలుగు ఆవులు, 20 మేకలు మరణించాయి. గ్రామానికి చెందిన పాంగి కల్యాణ్,పాంగి అప్పారావు, చిన్నారావులకు చెందిన మూగజీవాలు మృతి చెందాయి.బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

టేకు చెట్లను నరికిన కేసులో ఎవరినీ వదిలిపెట్టేది లేదు



రంపచోడవరంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో నరేంధిరన్

రంపచోడవరం: మారేడుమిల్లి అటవీ పరిధిలోని టేకు ప్లాంటేషన్‌లో టేకు చెట్లను అక్రమంగా నరికిన వారిని వదిలిపెట్టేది లేదని డీఎఫ్‌వో నరేంధిరన్ తెలిపారు. రంపచోడవరం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మారేడుమిల్లి రేంజ్ పరిధిలో సౌత్, నార్త్ ఏరియాల్లో 378 టేకు చెట్లను నరికివేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులను గుర్తించి, కేసు నమోదు చేశామని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారని చెప్పారు. ఆ చెట్లను దాదాపు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఎక్కువగా పడిపోయిన చెట్లను నరికివేశారని, అటువంటి చెట్లు 300 వరకూ ఉంటాయన్నారు. స్వాధీనం చేసుకున్న కలపను రాజమహేంద్రవరంలోని కలప డిపోకు తరలించినట్టు చెప్పారు. తరలించిన కలప సుమారుగా 60 సీఎంటీలు ఉంటుందన్నారు.గతంలో గొర్రెగేదెలను చంపిన కేసులో ఓ వ్యక్తిని పట్టుకుని, అతని వద్ద బాణాలు, గొర్రెగేదె మాంసం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దీంతో అధికారులను ఇబ్బందులకు గురి చేసేందుకు టేకు ప్లాంటేషన్‌లో కలపను నరికించేందుకు కొంత మందిని పురిగొల్పినట్టు ఆయన చెప్పారు. టేకు ప్లాంటేషన్‌లో కలప నరికిన కేసులో ఇద్దరు వ్యక్తుల కంటే ఎక్కువ మంది ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్నామని తెలిపారు. ఈ కేసులో ఎవరిని వదిలిపెట్టేది లేదన్నారు. టేకు ప్లాంటేషన్‌లో చెట్లు నరికి వేతకు గురవుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. మారేడుమిల్లి టేకు ప్లాంటేషన్ పరిధిలో కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పందిరిమామిడిలో ఫారెస్టు చెక్‌పోస్టును ఏర్పాటు చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మారేడుమిల్లి రేంజ్ పరిధిలో జరిగిన వ్యవహారంతో సీసీఎఫ్ డివిజన్ పరిధిలో టేకు ప్లాంటేషన్ పరిస్థితిపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారని చెప్పారు. స్క్వాడ్ సిబ్బంది ప్లాంటేషన్ తనిఖీలు నిర్వహించారన్నారు. రంపచోడవరం డీఎఫ్‌వోగా తాను బాధ్యతలు తీసుకున్న తరువాత ఎంతో కాలం వీఎస్‌ఎస్‌లకు బకాయి ఉన్న రూ.2కోట్లను ఖాతాలకు జమ చేసినట్టు చెప్పారు. వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా టీమ్ హెడ్ డాక్టర్ పరాగ్ నిగమ్ శుక్రవారం మారేడుమిల్లి, నేషనల్ పార్క్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పర్యటించినట్టు తెలిపారు. పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో గొర్రెగేదెలను శ్రీశైలం అటవీ ప్రాంతంలో రీలోకేషన్ చేసేందుకు టీమ్ అధ్యయనం చేస్తుందన్నారు.



నేషనల్ వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా టీమ్‌తో డీఎఫ్‌వో నరేంధిరన్

ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో నిర్వహిస్తున్న బీఎస్సీ(హానర్స్), ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో 40 మందికి ప్రవేశం కల్పిస్తామని, కోర్సు ఫీజుగా రూ.65 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని, 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 14వ తేదీన కౌన్సెలింగ్ జరిపి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. నూతన విద్యా విధానం 2020లో పేర్కొన్న విధంగా ఈ కోర్సుకు మల్టీ ఎంట్రీ, ఎగ్జిట్ ఆప్షన్‌ను కల్పిస్తున్నారు. ఒక ఏడాది కోర్సు పూర్తి చేస్తే సర్టిఫికెట్, రెండు సంవత్సరాలు కోర్సు పూర్తిచేస్తే డిప్లమా, మూడు సంవత్సరాల కోర్సు పూర్తిచేస్తే బ్యాచలర్ డిగ్రీ, నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తి చేస్తే హానర్స్ డిగ్రీ, ఐదు సంవత్సరాలు పూర్తిచేస్తే ఎమ్మెస్సీ డిగ్రీని అందిస్తారు. ఇంటర్ ఎంపీపీ, బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాయలంలో ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందజేయాలని సూచించారు.

తాటిగుడ జలపాతానికి రూ.6 కోట్లతో రోడ్డు



తాటిగుడ జలపాతం

- ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు



విస్తరణ పనులు జరిగే తాటిగుడ జలపాతానికి వెళ్లేమార్గం

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగుడ జలపాతానికి మంచిరోజులు వచ్చాయి. పచ్చని పొలాలను ఆనుకుని ఉన్న ఈ జలపాతం పర్యాటక ప్రాంతంగా మంచి గుర్తింపు పొందడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శకులు భారీగా తరలివస్తుంటారు. గతంలో జలపాతం వద్ద సౌకర్యాలు లేకపోవడం పర్యాటకులు ఇబ్బందులు పడేవారు. ఏడేళ్లక్రితం సుమారు రూ.25 లక్షలతో పర్యాటకశాఖ సదుపాయలు కల్పించింది. పచ్చని పంటపొలాలను ఆనుకుని వ్యూపాయింట్, జలపాతం వద్దకు వెళ్లేందుకు మెట్లు, దుస్తులు మార్చుకునే గది, రెస్టారెంట్ నిర్మాణం చేపట్టారు. జలపాతానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం అంతంతమాత్రంగా ఉండడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం అనంతగిరి నుంచి పెద్దూరు మీదుగా జలపాతం వద్దకు రూ.6 కోట్లతో 40 అడుగుల సీసీరోడ్డు, తాటిగుడ గ్రామ సమీపంలోని రూ. 1.10 కోట్లతో వంతెన నిర్మాణానికి జాతీయ ఉపాధిహామీ పథకంలోని నిధులు మంజూరయ్యాయి. ఈ విషయమై ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ గణేష్ మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారులతో కలిసి ఇప్పటికే పెద్దూరు మీదుగా కొలతలు వేశామని చెప్పారు. ఇంకా పనులు ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు.

దారికాచిన మృత్యువు

బంధువులతో వారు ఎంతో ఆనందంగా గడిపారు. ఆ సంతోషంతో స్వగ్రామానికి బయలుదేరారు. వారి ఆనందాన్ని చూసి మృత్యువుకు కన్నుకుట్టిందేమో దారికాచి ఒకే సారి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. దీంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆలనాపాలనా చూసుకునే భర్త, అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఒకే సారి మరణించడంతో ఆ అభాగ్యురాలు గుండెలవిసేలా రోదించింది..ఆమెతో పాటు కుమార్తె కన్నీటిని ఆపడం ఎవరి తరమూ కావడంలేదు

- చింతవానిపాలెం మలుపు వద్ద ప్రమాదం
- బైక్‌తో పాటు లోయలో పడి తండ్రి, కొడుకు మృతి
- బైక్ నుంచి దూకేసి ప్రమాదం నుంచి బయటపడిన భార్య, కూతురు
- శోక సంద్రంలో బంధువులు

కొయ్యూరు: ఆ రహదారిలో నిత్యం మృత్యు ఘంటికలు మోగుతున్నాయి. ఇప్పటికే పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరికొందరు జీవశ్చవాలుగా మారాయి. తాజాగా శుక్రవారం జరిగిన ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డతీగల మండలం వీరవరం పంచాయతీ సీతాపురానికి చెందిన వెలమ రాంబాబు(35), భార్య కాసులమ్మ, కుమార్తె మీనాక్షి, కుమారుడు ప్రశాంత్(6)తో కలిసి కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల గ్రామంలో ఉంటున్న తమ్ముడు బాలరాజు ఇంటికి గురువారం సాయంత్రం వచ్చాడు. ఆ రోజంతా తమ్ముడు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపాడు. శుక్రవారం ఉదయం తిరిగి తమ స్వగ్రామం సీతాపురానికి బైక్‌పై నలుగురూ బయలుదేరారు. బైక్‌పై వెనుక భార్య,కుమార్తెను, ముందున కుమారుడిని ఎక్కించుకుని వెళుతుండగా బాలరేవుల నుంచి బయలుదేరిన పావు గంటలో ఘోరం జరిగిపోయింది. నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణించిన అనంతరం చింతవానిపాలెం దాటిన తరువాత ఇరుకైన మలువు వద్ద మొదటి డౌన్‌లో బ్రేకులు ఫెయిలై ద్విచక్రవాహనం అదుపు తప్పింది. ప్రమాదాన్ని గుర్తించిన వెనుక కూర్చున్న భార్య, కుమార్తె బైక్‌పై నుంచి దూకేశారు. బైక్ లోయలోకి దూసుకుపోవడంతో బండ రాళ్లు తగిలి తండ్రీకొడుకులు మరణించారు. ఈ ప్రమాదంలో భార్య కాసులమ్మ చేయి విరిగింది. ఆమెను చికిత్స కోసం రాజేంద్రపాలెం ఆస్పత్రికి, అక్కడి నుంచి నర్సీపట్నం ఏరియాఆస్పత్రికి తరలించారు. రాంబాబు, కాసులమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు రాంబాబు, ప్రశాంత్ మరణించడంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇక తమకు దిక్కెవరని భార్య, కుమార్తెలు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. మృతదేహాలకు ఎస్‌ఐ రామకృష్ణ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన కాసులమ్మ



లోయలో పడిన బైక్





సంఘటన స్థలంలో మృతి చెందిన ప్రశాంత్, రాంబాబు

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద్

దాబాగార్డెన్స్(విశాఖ): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శివానంద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది డాక్టర్ శివానంద్‌కు అభినందనలు తెలిపారు. ఇటీవల కేజీహెచ్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ లాంగ్ లీవ్‌లో ఉన్న దృష్ట్యా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణికి బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డాక్టర్ శివానంద్ కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.



శివానంద్

బడి తెరిచిన రోజునే విద్యాకానుక పంపిణీ

- స్కూళ్లకు పుస్తకాలు సకాలంలో సరఫరా
- ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖ విద్య: బడి తెరిచిన రోజునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ విద్యాకానుక అందించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ అన్నారు. డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి శుక్రవారం గాజువాకలోని ఉమ్మడి విశాఖ జిల్లా పుస్తకాల నిల్వ గోదామును పరిశీలించారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు ఎన్ని పుస్తకాలు వచ్చాయి, ఎంత మేర మండలాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా చేశారనే విషయాలను గోదాము మేనేజర్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గోదాములో పుస్తకాలను భద్రపరచడంలో తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు 14,66,883 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా మే 31 వరకు 9,16,691 వచ్చినవని అధికారులు వివరించారు. వీటిలో 7,03,154(76 శాతం) మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేయటం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు 45 శాతం, అనకాపల్లి జిల్లాకు 48 శాతం, విశాఖపట్నం జిల్లాకు 47 శాతం పాఠ్యపుస్తకాలను సరఫరా చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ సరిపడా పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు సరఫరాచేసేలా తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏ ఒక్క విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందలేదనే మాట రాకూడదన్నారు. పర్యటనలో సమగ్రశిక్ష ఏపీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పుస్తక నిల్వ గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయ భాస్కర్

అంధుల జీవితాల్లో ఆశాకిరణం

- అంధ బాలికలకు విశాఖలో ప్రత్యేక పాఠశాల
- ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక విద్యాలయం
- చదువులతో పాటు ఆటల్లోనూ రాణించేలా తర్ఫీదు
- అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో ఆడిన పాఠశాల విద్యార్థిని
- రాష్ట్రంలో ఏ జిల్లా వారైనా ఇక్కడ చేరే అవకాశం
- 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


విద్యార్థినులకు చెస్ నేర్పుతున్న పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్


వసతి గృహంలో విద్యార్థినులకు పసందైన విందు భోజనం

విశాఖ విద్య: అంధ బాలికల చదువులకు బీచ్‌రోడ్‌లోని పాఠశాల భరోసాగా నిలుస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయనగరం, హిందూపూర్‌లో పాఠశాలలు నిర్వహిస్తుండగా.. విశాఖలో బాలికలకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన వారైనా ఇక్కడి పాఠశాలల్లో చదువుకోవచ్చు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 40 శాతంకు పైగా అంధత్వం కలిగిన బాలికలు ఇక్కడ చేరేందుకు అర్హులు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో 100 మంది సామర్థ్యం కాగా.. ఇప్పటికే 52 మంది బాలికలు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాల్లో భాగంగా మిగిలిన 48 మంది సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

సువిశాల విస్తీర్ణంలో..

సముద్ర తీరానికి అనుకుని(బీచ్ రోడ్) మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల కొనసాగుతోంది. అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా ఇచ్చే యూనిఫాంలతో పాటు విద్యా కానుక వీరికి అందిస్తున్నారు. అంధ విద్యార్థినులు చదువులతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది. పాఠశాలలో క్రీడలకు కూడా ప్రాధాన్యమిస్తుండటంతో.. విద్యార్థినులు చెస్, వెయిట్ లిఫ్టింగ్ వంటి పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు.

పది ఫలితాల్లో రికార్డు

పాఠశాల విద్యార్థినులు కొన్నేళ్లుగా 10వ తరగతిలో శతశాతం ఫలితాలు సాధిస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌తో ప్రభుత్వం సరఫరా చేసిన బ్రెయిలీ లిపితో ముద్రించిన పుస్తకాలను వినియోగిస్తూనే.. అధునాతన పరికరాలతో ఇక్కడి ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. నాన్ వెర్బల్ డెస్క్‌టాప్ అసిస్టెంట్(ఎన్‌వీడీఏ) విధానం ద్వారా కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే శబ్దాలను అనుసరించి సరికొత్త పాఠ్యాంశాలను నేర్చుకుంటున్నారు. డైజీ ప్లేయర్లో రికార్డు చేసిన పాఠ్యాంశాలను వింటూ చదువుల్లో ముందుకెళ్తున్నారు. బ్రెయిలీ లిపితో నిక్షిప్తమైన 'అని సిస్టమ్స్'(దివీస్ సంస్థ స్పాన్సర్) విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.


విశాలమైన గదిలో పడక కోసం ఏర్పాట్లు

భద్రతతో కూడిన విద్య

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా పాఠశాలలో విద్యార్థినులకు భద్రతతో కూడిన చదువులు అందిస్తున్నాం. మేము కూడా వారిలాంటి వారిమే కాబట్టి, మా బిడ్డల్లా చూసుకుంటూ వారి భవిష్యత్‌కు పాటుపడుతున్నాం. పాఠశాలలో గతంలో కన్నా బాగా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రాష్ట్రంలోని ఎక్కడ వారైనా స్కూల్లో చేర్చుకుంటాం.

– జి.తిరుమల ప్రసాద్, ప్రిన్సిపాల్, అంధ బాలికల ఆశ్రమ పాఠశాల

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్(విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.500 చెల్లిస్తే పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

డీఎస్‌వో శ్యామ్‌కుమార్ సేవలు ఆదర్శనీయం

- కలెక్టర్ విజయ సునీత

పాడేరు : జిల్లా పౌర సరఫరాల అధికారి శ్యామ్ కుమార్ సేవలు ఆదర్శనీయమని కలెక్టర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఎస్‌వో ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఆఫ్‌లైన్ సమస్యలను శ్యామ్‌కుమార్ అధిగమించి సకాలంలో లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారని ప్రశంసించారు. పౌర సరఫరాల సేవలలో ఇతర జిల్లాలతో సమానంగా అగ్రగామిగా నిలిపారన్నారు. టైపిస్టుగా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారిగా నిలిచారన్నారు. సౌమ్యుడిగా పేరొందుతూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించినట్టు తెలిపారు. శ్యామ్ కుమార్ సేవలను యువత ఆదర్శంగా తీసుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డీఎస్‌వో శ్యామ్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానని చెప్పారు. సిబ్బంది సహకారంతో అన్ని సమస్యలను అధిగమించి లబ్ధిదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు అందజేయగలిగానన్నారు. అనంతరం శ్యామ్‌కుమార్‌ను కలెక్టర్ విజయ సునీత దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో బి.పద్మావతి, ఎస్‌డీసీ పి.అంబేడ్కర్, సివిల్ సప్లై డీఎం బి.గణేష్‌కుమార్, సివిల్ సప్లై డీటీ ప్రశాంత్, డీపీఆర్‌వో గోవిందరాజులు, ఎల్‌డీఎం రవితేజ, తహసీల్దార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


రిటైర్ అయిన డీఎస్‌వో శ్యామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ విజయసునీత తదితరులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

– శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

అడుగంటిన నీరు.. చేపల మృత్యువాత

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము సాగునీటి చెరువులో నీరు అడుగంటడంతో అందులోని చేపలు శుక్రవారం మృత్యువాత పడ్డాయి. కురిసిన వర్షాలతో సాగునీటి చెరువులో నీరు చేరింది. అయితే రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో జలాలు అడుగంటాయి. దీంతో జలచరాలు మృత్యువాతకు గురయ్యాయి. నీరు సమృద్ధిగా ఉండడంతో చేప పిల్లలు తెచ్చి పెంచుతున్నామని, తీరా పట్టుబడి సమయం వచ్చే సరికి ఈ విధంగా చేపలు అన్ని ఒకేసారి మరణించడంతో దాదాపు లక్ష రూపాయల నష్టం సంభవించిందని సర్పంచ్ చీడి శివ విలేకరులకు తెలిపారు.


మృతి చెందిన చేపలు

పొగాకు దుష్ప్రభావాలపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు: పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించటానికి వైద్యారోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని ఇందులో ప్రత్యేక అవగాహన శిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత స్పష్టం చేశారు. వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా శుక్రవారం పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రి నుంచి ర్యాలీ ప్రారంభించి మెయిన్ బజార్ మీదుగా పాత బస్టాండ్ వరకు నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. పొగాకు వాడకం వలన కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ పొగాకు దూరంగా ఉండాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రయ్య, సైకియాట్రీ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఎస్.రాజు, వైద్యాధికారులు, మెడికల్ కళాశాల సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, డ్రగ్ అడిక్షన్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి.. అనుమానాస్పదం

- వెలికితీసిన మృతదేహానికి పోస్టుమార్టం

మారేడుమిల్లి : కుండాడ గ్రామంలో సహజ మరణంగా భావించిన ఒక వ్యక్తి మృతి అనుమానాస్పదంగా మారింది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. కుండాడ గ్రామానికి చెందిన కుండ్ల లీలా ప్రసాద్‌రెడ్డి (55) ఈ నెల 27వ తేదీన మృతి చెందాడు. ఆయన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు చుట్టుపక్కల వారికి చెప్పిన బంధువులు.. ఆ విషయం పోలీసులకు తెలపకుండా మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. మృతుడిది ఆత్మహత్యా కాదా అని అనుమానం వచ్చిన గ్రామస్తులు వీఆర్వోకు తెలపడంతో ఆయన మారేడుమిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాము తెలిపారు.

గుర్తింపులేని పాఠశాలల వివరాలు బహిర్గతం చేయండి

- విద్యాశాఖకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం

తుమ్మపాల: జిల్లాలో గుర్తింపులేని అన్ని విద్యాసంస్థల వివరాలు 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే బహిర్గతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేసినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అన్నారు. ఇటువంటి పాఠశాలల్లో చేర్పించడం వల్ల పిల్లల భవిష్యత్ అగమ్యగోచరమే కాకుండా తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిన వారవుతారని అన్నారు. అటువంటి పాఠశాలల వివరాలు ప్రసార, ప్రచార మాధ్యమాలు, ఇతర సోషల్ మీడియా ద్వారా అందరూ తెలుసుకునేలా బహిర్గతం చేస్తూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుర్తింపు పొందేందుకు తాత్సారం చేసే పాఠశాలలపై చట్టప్రకారం చర్యలతోపాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకడుగు వేయొద్దన్నారు. తల్లిదండ్రులు అటువంటి పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించకూడదని సూచించారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

అరకులోయరూరల్: కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం సూచించారు. ఆయన పోలింగ్ కౌంటింగ్ ఏజెంట్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు చురుకైన పాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ అరుకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని శరభగూడ వద్ద ఏజెంట్లు పార్టీ శ్రేణులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న నిర్వహించే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ వద్ద కౌంటింగ్ ఏజెంట్లు చురుకైన పాత్రను పోషిస్తూ, ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఏదైనా తప్పుడు పనులకు పాల్పడితే కౌంటింగ్ సెంటర్ వద్ద సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.


మాట్లాడుతున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

మృత్యు మలుపు

- చింతవానిపాలెం రోడ్డుపై పెరుగుతున్న ప్రమాదాలు
- రక్షణ గోడ లేక అదుపుతప్పి లోయలోకి దూసుకుపోతున్న వాహనాలు
- వేర్వేరు ప్రమాదాల్లో ఇప్పటికి నలుగురు మృతి


మలుపు పక్కన భారీ రంధ్రం


ప్రమాదం జరిగిన చోట మలుపు వద్ద కానరాని రక్షణ గోడ

కొయ్యూరు : ఆ మార్గంలో మలుపు ఇప్పటికే నలుగురు ప్రాణాలు తీసేసింది... మండలంలోని చింతవానిపాలెం నుంచి కొయ్యూరు వచ్చే రహదారిలో ఇరుకైన మలుపు ఉంది.. ఈ మార్గంలో డౌన్‌లో ఉన్న ఈ ప్రాంతంలోని మలుపు వద్ద ఏ మాత్రం ఆదమరిచినా వాహనం అదుపు తప్పి లోయలోకి దూసుకుపోతున్నాయి. ఫలితంగా వాహన డ్రైవర్లు, ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ ప్రాంతంలోని మలుపు వద్ద రక్షణ గోడ లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని పలువురు చెబుతున్నారు. ఈ మలుపు వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాన్ని గ్రహించలేక డ్రైవర్లు యాక్సిడెంట్‌కు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డు నిర్మించినపుడు ఈ మార్గంలోని ప్రమాదాలు పొంచి ఉన్న మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మించలేదని, ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలోని మలుపు వద్ద రెండేళ్ల క్రితం ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరి కొందరికి గాయాలయ్యాయి. ఇప్పుడు అదే మలుపు వద్ద శుక్రవారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడ రక్షణ గోడ లేక మోటార్‌బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతి చెందారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు హడలెత్తిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలోని మలుపుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



చింతవానిపాలెం రోడ్డులోని మలుపులు ప్రమాదాలకు పిలుపుగా మారాయి. ఈ ప్రాంతంలో రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాజెక్ట్స్ అధికారులు వెంటనే ఈ మలుపు వద్ద రక్షణ గోడను నిర్మాణం చేయాలి.లేకుంటే ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోవలసి ఉంటుంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి

– కూనిశెట్టి మల్లికార్జున్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు, కొయ్యూరు

గోడను నిర్మిస్తాం

ప్రమాదాలు జరుగుతున్న ఆ ప్రాంతంలో గోడను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం.అక్కడ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం .ఇప్పటికే దీనిపై గోడను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం.నిధులు రాగానే పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేస్తాం.

– ఈశ్వరరావు, ప్రాజెక్ట్స్ డీఈ

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి


మృతదేహాలు ఉన్న లారీ


అంబులెన్స్‌లో తరలిస్తున్న మృతదేహాలు


లారీ డ్రైవర్

నవాబుపేట క్రాస్‌రోడ్స్ (పెనుగంచిప్రోలు): అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల పరిధిలోని నవాబుపేట క్రాస్‌రోడ్స్ వద్ద శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడుకు చెందిన లారీ విశాఖపట్నంలో బొగ్గు లోడ్ చేసుకుని జగ్గయ్యపేట సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తోంది. ఈ క్రమంలో అనకాపల్లికి చెందిన లారీ డ్రైవర్ కనగాల అప్పారావు లారీలో తనతో పాటు సరదాగా వచ్చిన అనకాపల్లికి చెందిన స్నేహితులు గంధం సత్యనారాయణ(57), బోదాపు వెంకట సత్య నరసింగరావు(47) లారీలో ప్రయాణిస్తూచనిపోయినట్టు 108 సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించాడు. చిల్లకల్లు ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ శంకర్ వచ్చేసరికి సత్యనారాయణ, నరసింగరావు మృతి చెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ అప్పారావుతోపాటు మృతులు కూడా మద్యం తాగి ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఎండ, ఉక్కపోతకు తట్టుకోలేక వారు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఎలా చనిపోయారని డ్రైవర్‌ను అడిగితే ఏమీ చెప్పలేక పోతున్నాడు. మధ్యాహ్న సమయంలో ఎక్కడో చనిపోయి ఉంటారని లారీని ఇక్కడకు తెచ్చి ఆపేశాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. నరసింగరావు ఎస్‌బీఐలో పనిచేసి సస్పెండ్ అయి ఉన్నాడని, సత్యనారాయణ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఉద్యోగవిరమణ పొందినట్టు వివరాలు తెలిశాయని పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిద్రిస్తున్న క్లీనర్ల పైనుంచి వెళ్లిన లారీ

- ఎన్టీపీసీ బూడిద చెరువు వద్ద ప్రమాదం
- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఫ్లైయాష్ పాయింట్ వద్ద గురువారం రాత్రి నిద్రిస్తున్న క్లీనర్లపై నుంచి లారీ వెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీపీసీ బూడిద చెరువు ఎల్–4 వద్ద గురువారం రాత్రి 11.30 గంటలకు ఫ్లైయాష్ లోడింగ్ కోసం లారీలను వరస క్రమంలో ఉంచారు. వేర్వేరు ఫ్లైయాష్ లోడింగ్ లారీల క్లీనర్లుగా అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం గిడుతూరుకు చెందిన వారా వినయ్ కుమార్(19), అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన ఎం.దిలీప్‌కుమార్(24) పని చేస్తున్నారు. వీరిద్దరూ సీరియల్ మొదట ఉన్న లారీ ముందు ఎడమ చక్రం వైపు నిద్రించారు. ఇంతలో లోడింగ్ సీరియల్ రావడంతో లారీ డ్రైవర్ వీరు నిద్రించిన విషయం గుర్తించకుండా.. వారిపై నుంచి నడిపాడు. ఈ ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన తోటి డ్రైవర్లు వీరిద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వినయ్‌కుమార్ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మెరుగైన చికిత్స కోసం దిలీప్‌ను కేజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. వినయ్‌కు వివాహం కాలేదు. దిలీప్‌కు మూడేళ్ల కిందట వివాహం కాగా.. రెండేళ్ల కుమార్తె ఉంది. వినయ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బాలసూర్యారావు చెప్పారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి వినయ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గాయపడిన దిలీప్‌కు మెరుగైన వైద్యం అందించాలన్నారు.